క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



దెందులూరులో పోలింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జితేంద్ర

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం దెందులూరు తహసీల్దార్ వి.జితేంద్ర మండలంలోని దెందులూరు, కొవ్వలి గ్రామాల పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. భద్రత, తాగునీరు, విద్యుత్, ప్రహరీ, బెంచీలు, శ్లాబ్ ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ హేమ, వీఆర్ఓలు శ్రీను, అనిరుథ్ ఉన్నారు.

విఘ్నేశ్వరస్వామి పంచమ వార్షికోత్సవం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్

దెందులూరు: కొవ్వలిలో మంగళవారం శ్రీ సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి పంచమ వార్షికోత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎంపీటీసీ గోరిపర్తి వరలక్ష్మి రంగారావు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్‌లకు అర్చకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం



న్యాయదేవత చిత్రపటానికి పూలమాల వేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: స్థానిక నర్సింగ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. న్యాయదేవత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గి శెట్టి నూకరాజు మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, లింగ సమానత్వం, మానవ హక్కులు, సామాజిక రక్షణ వంటి వాటివి ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం లక్ష్యమని అన్నారు. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించేదే సామాజిక న్యాయ ముఖ్య ఉద్దేశమని ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్సింగ్ విద్యార్థిని మాళవిక అన్నారు.

గణపవరం ఎంపీడీఓగా ప్రభాకరరావు



ఎంపీడీఓ ప్రభాకరరావుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

గణపవరం: స్థానిక ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకరరావుకు మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది మంగళవారం ఘనస్వాగతం పలికారు. కాళ్ల మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయన మంగళవారం గణపవరంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, సిబ్బంది ప్రభాకరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం ప్రభాకరరావు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రాట్నాలమ్మ సేవలో మంత్రి తుమ్మల



మంత్రి నాగేశ్వరరావును ఆహ్వానిస్తున్న కొఠారు

పెదవేగి : పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారిని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావులు ఘన స్వాగతం పలికారు. అర్చకులు మంత్రికి అమ్మవారి చిత్రపటం, వస్త్రం అందించి ఆశీర్వదించారు. మహిమగల దేవత రాట్నాలమ్మవారు అని తుమ్మల పేర్కొన్నారు.

వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం



గణపవరం : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



భీమడోలు : వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లు సేవాభావానికి ప్రతీకలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపవరం మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మానస పుత్రిక వలంటీరు వ్యవస్థ అని,వీ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ వ్యవస్థను కించపరిచేలా ప్రతిపక్షాలు, పచ్చ మీడియా చేస్తోన్న దుష్ప్రచారానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందజేస్తూ, ప్రజాభిమానాన్ని పొందుతున్న వలంటీర్లను దొంగలు, దోపిడీదారులు, హంతకులుగా ప్రచారం చేయడం దారుణమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా, కుటుంబాన్ని వదలి ప్రజల ప్రాణాలు కాపాడటానికే ప్రాధాన్యత ఇచ్చిన వలంటీర్ల సేవలను ప్రజలు, ప్రభుత్వం ఎప్పటికీ మరువదని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వలంటీరు వ్యవస్థ వెన్నెముక లాంటిందని, వీరి సేవలు ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా ఉండాలని అన్నారు. జగన్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడానికి పార్టీ శ్రేణులతో పాటు వలంటీర్లు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. గణపవరం మండలంలోని 376 మంది వలంటీర్లలో ఇద్దరికి సేవా రత్న, ఐదుగురికి సేవా వజ్ర, 369 మందికి ఉత్తమ వలంటీరు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, ఎంపీడీఓ ఎంఎస్ ప్రభాకరరావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్ మూర అలంకారం, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, పార్టీ నాయకులు రొంగల శ్రీను, మండల గృహసారథుల కన్వీనర్ ఎంఆర్‌కే, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజాసేవకే అంకితం

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వలంటీర్లు సేవే లక్ష్యంగా పని చేస్తే ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో మంగళవారం రాత్రి వలంటీర్ల వందనం కార్యక్రమం సర్పంచ్ పాము సునీత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రతి పథకాన్నీ అవినీతిమయం చేసి ప్రజలను దోచుకున్నారని, ఫలితంగా గత ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కోకు ప్రజలు దిమ్మతిరిగే షాక్ ఇచ్చి ఇంటికి పంపించారని గుర్తుచేశారు. ప్రతి పథకాన్నీ అర్హతే ప్రామాణికంగా పారదర్శకతతో సమర్థవంతంగా అమలు చేయాలన్న ఏకైక లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారని వివరించారు. ఆ కుటుంబాలకు పథకాలను అందిస్తూ ఆ కుటుంబ బిడ్డలుగా వారితో వలంటీర్లు మమేకమయ్యారన్నారు. ఇది తట్టుకోలేని చంద్రబాబు, తనయుడు లోకేష్, ప్యాకేజీ స్టార్ పవన్‌కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. కోవిడ్ కష్టకాలంలో ఏ పథకం ఆగకుండా ముందుకు సాగిందంటే ఒక్క వలంటీర్లు వల్లే సాధ్యమైందని కొనియాడారు. గడపగడపకూ సంక్షేమ పథకాలు తీసుకెళ్లి అవ్వాతాతలు, అక్కా చెల్లెమ్మలకు అందించిన ఘనత వలంటీర్ల వ్యవస్థకే దక్కుతుందని చెప్పారు. సీఎం జగన్ వలంటీర్ల సేవలకు గుర్తింపుగా సేవా మిత్ర, రత్న, వజ్ర వంటి అవార్డులను అందించిన గౌరవిస్తున్నారని తెలిపారు. దెందులూరులో జరిగిన సిద్ధం సభకు ఆరు లక్షల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని, రాప్తాడు సభకు 12 లక్షల మంది ప్రజలు రావడంతో ప్రతిపక్ష పార్టీలకు వెన్నులో వణుకు పుట్టిందని వివరించారు. ఒక ప్రాంతీయ పార్టీ సభలకు లక్షలాది మంది జనం తరలిరావడం దేశ చరిత్రలో ఇదే ప్రథమన్నారు. అనంతరం సేవా మిత్ర, రత్న, వజ్ర అవార్డు గ్రహీతలు 342 మందికి వాసుబాబు శాలువాలను కప్పి ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, డీసీసీబీ డైరెక్టర్ కందుల పాటి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీడీఓ టి.స్వర్ణలత, ఆర్‌బీకేల చైర్మన్ పి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, యూత్ మండల అధ్యక్షుడు మద్దుల రాజా, గ్రామకార్యదర్శి నందేటి ఠాగూర్, ఎంపీటీసీలు అంబటి దేవి, గంటా శ్రీనివాసరావు, పాల్నాటి శ్రీను, విజయభాను, ఆజామ్, సర్పంచులు దాయం సుజాత, వెజ్జు బాలాజీ, నీలం శ్రీనువాసరావు, గుడివాడ నాగగౌతమి, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణ రాజు, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి అంబటి నాగేంద్ర, పార్టీల గ్రామ అధ్యక్షులు మద్దాల అప్పారావు, రామిశెట్టి శ్రీను, వోరా నాగదత్త, నాయకులు సుతాపల్లి ప్రసాద్, చిలపర్తి రామారాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలు

పెదవేగి : మొక్కజొన్న సాగులో క్షేత్రస్థాయి నుంచే యాజమాన్య పద్ధతులతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కేంద్ర సమగ్ర సస్యరక్షణ ఏపీపీఓ సురేష్ అన్నారు. పెదవేగి మండలం పెదకడిమి, అమ్మపాలెం గ్రామాల్లో మొక్కజొన్న పంట సాగుపై కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ విభాగం ప్రకృతి వ్యవసాయ అధికారుల బృందం మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు మొక్కజొన్న పంట సాగులో క్షేత్రస్థాయి నుంచే తీసుకోవాల్సిన మెళకువలు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, పంట ఎదుగుదల సమయంలో పాలపొట్ట దశ ఏర్పడక ముందు, తరువాత పంటకు అందించే ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు సమగ్ర సస్యరక్షణ పరికరాలు, లింగాకర్షక బట్టలు పంపిణీ చేశారు. పురుగు మందులు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పెదవేగి ఏఓ, కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ బృందం అధికారులు ఏపీపీఓ, దక్షిణామూర్తి, వీరబాబు, విమల, పెదకడిమి అమ్మపాలెం రైతులు పాల్గొన్నారు.

హోటల్‌పై కేసు నమోదు

ఉంగుటూరు: నారాయణపురం సెంటర్లోని ఓ హోటల్‌పై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడి చేశారు. గృహ అవసరాలకు వినియోగించే 8 గ్యాస్ సిలిండర్లు గుర్తించి, హోటల్ యజమానిపై కేసు నమోదుచేశారు. ఈ సిలిండర్ల విలువ రూ.22,191 అని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రామంలో మంగళవారం రాత్రి కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై కె.స్వామి తెలిపారు. వారి నుంచి ఐదు కోడి పుంజులు, రూ.2 వేలు నగదు, 18 కోడి కత్తులు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



భోగాపురం సచివాలయం వద్ద రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి



రోగులకు ఉచితంగా మందులను అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

భీమడోలు: గుండుగొలను పంచాయతీ పరిధిలోని భోగాపురం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరానికి రోగుల పోటెత్తారు. 453 మంది హాజరుకాగా, వీరికి వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగులో కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు, ఈసీజీలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందించారు. నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. తొలుత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీడీఓ టి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గైనకాలజిస్ట్ వై.స్నృజన, పిల్లల వైద్య నిపుణుడు డి.సుహాంత్, జగనరల్ వైద్యులు కె.శ్రీలక్ష్మి, జాహ్నవి శిబిరానికి వచ్చిన దీర్ఘకాలిక రోగులు, బాలింతలు, గర్భిణులు, కౌమర, నవజాతల సంరక్షణ తదితర అంశాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈవోఆర్డీ ఎ.సుందరి, గ్రామకార్యదర్శి మురళీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో ఖాజావల్లి



హాజరైన ఉద్యోగులు

ఉంగుటూరు: రాబోయే ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఖాజావల్లి అన్నారు. మంగళవారం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసుల సమక్షంలోనే ఎన్నికల సామగ్రి తరలించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు. ఓటింగ్ యంత్రాలు పనిచేయకపోతే వెంటనే మార్చాలని సూచించారు. పోలింగు కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు నిర్వహణ తప్పనిసరిగా ఉండాలన్నారు. తహసీల్దార్ కేవీ శివయ్య మాట్లాడుతూ నిస్పక్షపాతికంగా, పారదర్శకంగా ఉద్యోగులు ఎన్నికల సమయంలో పనిచేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐ సుభాష్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, మణికుమార్, సుధాకర్, తహసీల్దార్ వరహాలయ్య, ఎంపీడీఓ శర్మ మాట్లాడారు. నియోజకవర్గంలోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, మోడల్‌కోడ్‌ఆఫ్ కాండాక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



ప్రత్యేకాలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి



సత్యనారాయణ వ్రత పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: గాలాయగూడెంలో శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. అర్చకులు అచ్చమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ప్రదక్షిణలు, పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

పోషకాహారం, వ్యాయామంతో ఆరోగ్యం



మందులు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ఉంగుటూరు: పోషక విలువలతో కూడిన ఆహారం తీసికోవడంతోపాటు సరైన వ్యాయామం చేయడం ద్వారా కాళ్లు, వెన్నెముఖ సమస్యలను దూరం చేసుకోవచ్చని వేద స్పైన్ సెంటర్ (వెన్నుముక నిపుణులు, రాజమహేంద్రవరం) డాక్టర్ తేజోఫణీంద్ర అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత వెన్నుముక, ఎముకులు వైద్య శిబిరం నిర్వహించారు. గొల్లగూడెం, రామచంద్రపురం, గోపాలపురం, నల్లమాడు, కంసాలిగుంట, యర్రమిల్లిపాడు గ్రామాలకు చెందిన 170 మందికి తేజోఫణీంద్ర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కరపా శ్రీనివాసరావు, గ్రామ పెద్ద వేమలుపల్లి సూర్యచంద్రరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, నాయకులు మలకల పలి నాగు పాల్గొన్నారు.

పెదపాడు మండలానికి 40 వేల డస్ట్‌బిన్స్



డస్ట్ బిన్లు పంపిణీ చేస్తున్న ఈఓఆర్డీ సూర్యకుమార్

పెదపాడు : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా గ్రామాల్లో చెత్త సేకరణకు పెదపాడు మండలానికి 40 వేల డస్ట్‌బిన్స్ సరఫరా చేసినట్టు మండల పంచాయతీ విస్తరణాధికారి సాధనాల సూర్యకుమార్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. పెదపాడు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లోని ప్రతి ఇంటికీ రెండు డస్ట్‌బిన్లు చొప్పున అందిస్తున్నట్టు సూర్యకుమార్ చెప్పారు. తాళ్లగూడెం, పునుకొల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి అభినందన

ఏలూరు (టూటౌన్): రాజ్యసభకు రెండోసారి ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డికి జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు అభినందనలు తెలిపారు. తాడేపల్లిలో మంగళవారం సుబ్బారెడ్డిని ఆయన నివాసంలో కలిసినట్టు చెప్పారు. సుబ్బారెడ్డి నీతి, నిజాయితీకి నిలువటద్దమని, పేదల కోసం నిరంతరం పోరాటం చేసే వ్యక్తని కొనియాడారు.

కొల్లేరులో చేపల చెరువులు తవ్వితే సహించం



కొల్లేరు ప్రాంతంలో సరిహద్దులను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

భీమడోలు: కొల్లేరు అభయారణ్యంలో అక్రమంగా చెరువులు తవ్వితే సహించేది లేదని విజిలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు హెచ్చరించారు. కొల్లేరు అభయారణ్యంలో కొందరు చేపల చెరువులు తవ్వుతున్నట్టు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో రెండు రోజులుగా కొల్లేరు ప్రాంతాల్లో బృందాలు విస్తృతంగా పర్యటించారు. మంగళవారం లక్ష్మీపురంలోని గుంటూరు, రాజమండ్రి, వైజాగ్ విజిలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం కొల్లేరు ప్రాంతాన్ని సందర్శించారు. కొల్లేరు సరిహద్దులను పరిశీలించారు. ఎక్కడైనా కాంటూరు హద్దులు దాటి వచ్చింది లేనిదీ ఆరా తీశారు. కాంటూరు కుదించి తమకు న్యాయం చేయాలని, జీవనాధారమైన చెరువులను ధ్వంసం చేయవద్దని అధికారులకు ఆగడాలలంక వాసులు మొరపెట్టుకున్నారు. కొల్లేరులో చేపల చెరువులు తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఎక్కడా చేపల చెరువులు తవ్వడం లేదని డీఎఫ్‌ఓ ఎం.హిమశైలజ తెలిపారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



అంబర్‌పేట శివాలయంలో పూర్ణ హోమ పూజలు చేస్తున్న యాజ్ఞిక బృందం

భీమడోలు: అంబర్‌పేటలోని అతిపురాతన ఆలయం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో యాజ్ఞిక, ఋత్విక బృందం అర్చకులు మేడూరి ఏడుకొండలు, మేడూరి శ్రీనివాసరావు నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఉదయం పాలాభిషేకం, జలాదివాసం పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం, బలిహరణ, యాగశాలార్చన, దేవతాహోమాలు నిర్వహించారు. శివపార్వతీలు, గణపతి, నాగబంధ, ఆంజనేయస్వామి, నందీశ్వర చండీశ్వర విగ్రహాలను ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఆలయ, విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎం.రాధ తెలిపారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న జిజ్జువరపు రవిప్రకాష్, మహిళలు

ఏలూరు (టూటౌన్): మహిళాభివృద్ధే లక్ష్యంగా మహిళా చైతన్య సేనను ఏర్పాటుచేసినట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా చైతన్య సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన బడుగు, బలహీన వర్గాల మహిళలను ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు మహిళలను ఐక్యం పరిచేందుకు మహిళా చైతన్య సేనను ఏర్పాటు చేశామన్నారు. ఈ వర్గాల మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మెషీన్లు మంజూరు చేసి, సబ్సిడీ రుణాలు అందించాలని ఆయన కోరారు. సమావేశంలో మహిళా చైతన్య సేన ఏలూరు జిల్లా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, పశ్చిమగోదావరి జిల్లా మహిళా చైతన్య సేన అధ్యక్షురాలు దిరుసు పాముల పుష్ప, ఏలూరు నగర అధ్యక్షురాలు సువార్త, తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలలపై ఫిర్యాదు



ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్ పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తోన్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా వృత్తివిద్యాధికారి బి.ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్యాలయంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు పూర్తి ఫీజు కడితేగాని హాల్ టికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో 80 శాతం ఫీజు కడితేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని విద్యార్థులను బెదిరించారని, ఫీజులు వసూలు చేశారని, తాజాగా పూర్తి ఫీజు కడితేగాని హాల్ టికెట్లు ఇచ్చేది లేదని చాలా యాజమాన్యాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా మాదిరిగా యాజమాన్యాల ప్రమేయం లేకుండా విద్యార్థులే నేరుగా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే లింకును ఇంటర్మీడియట్ బోర్డు త్వరగా విడుదల చేసే విధంగా మంత్రి బొత్స సత్యనారాయణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు రాజ్యాంగం ప్రామాణికంగా ప్రజలకు కల్పించిన చట్టాలు ఉపయోగపడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. మంగళవారం జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్ఆర్ పేటలోని ఎస్వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఆయా చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ అసమానతలు తొలగించడానికి అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం, ఆర్థిక వెసులుబాటు కల్పించడం వంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకుంటున్నాయని తెలిపారు. ప్యానల్ అడ్వకేట్ కూన కృష్ణారావు మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహనతో ఉండాలన్నారు.